

వయనాడ్ బాధితులకు రూ.లక్ష విరాళం



ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భారతదేశంలో అభివృద్ధి అందానికి చిరునామాగా ఉన్న కేరళ ప్రస్తుతం ప్రకృతి విలయతాండవానికి అతలాకుతలంగా మారింది. ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసి బతుకులను ఛిద్రం చేసింది. ఈ విపత్కర పరిస్థితుల్లో తన వంతు సహాయంగా టెక్కలి జైభారత్ నేషనల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బైపల్లి పరమేశ్వరరావు రూ.లక్ష విరాళం కేరళ ముఖ్యమంత్రి నిధికి జమ చేసినట్లు గురువారం తెలిపారు. హుదూద్ సమయంలో, కర్నూలు వరదల సమయంలోనూ కష్టాల్లో ఉన్న వారికి భోజన సదుపాయాలు కల్పించామని తెలిపారు.

సాగనంపేందుకేనా?

- ఎండియు ఆపరేటర్లపై పనిభారం పెంచిన ప్రభుత్వం
- సమయ వేళలు పెంపు
- పంపిణీ గడువు కుదింపు

రేషన్ సరుకుల డోర్ డెలివరీపై టిడిపి కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలను తెరపైకి తీసుకొచ్చింది. సమయ వేళల పెంపు, గడువు తేదీ కుదింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా 1 నుంచి 17 వరకు వాహనాల ద్వారా సరకులు అందిస్తుండగా, పదో తేదీలోపే ముగించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఏడు వరకు సరుకులను అందిస్తుండగా, ఇప్పుడు ఉదయం ఏడు నుంచి రాత్రి పది గంటల వరకు పంపిణీ చేయాలని ఆదేశించింది. సర్వర్ పనిచేయక, పంపిణీలో సమస్యలు ఎదుర్కొంటున్న తమపై ప్రభుత్వం నిర్ణయం మరింత ఒత్తిడి పెంచనుందని ఆపరేటర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పొమ్మనకుండా పొగబెడుతోందని వారు అంటున్నారు.



రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్ (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు గత ప్రభుత్వం 2020లో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. సరుకుల పంపిణీకి ఆపరేటర్లను నియమించింది. వారికి రూ. 5.83 లక్షల విలువ చేసే వాహనాలను 90 శాతం సబ్సిడీపై సమకూర్చింది. అర్బన్ ప్రాంతాల్లో సరుకుల పంపిణీకి 2020లో ఫిబ్రవరి ఒకటో తేదీన, గ్రామీణ ప్రాంతాల్లో నిత్యవసర వస్తువులను అందించేందుకు ఫిబ్రవరి 15వ తేదీన వాహనాలను సమకూర్చింది. జిల్లాలో 422 మంది ఆపరేట్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్‌కు తొలుత ప్రభుత్వం రూ.16 వేలు వేతనంగా నిర్ణయించింది. వాహనాలకు డ్రైవర్లుగా మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన ప్రభుత్వం తర్వాత వారితో తూకం, ఈ-పాస్ మిషన్‌లో వివరాలు నమోదు తదితర పనులు అప్పగించింది. దీంతో తమకు ఇస్తున్న వేతనం చాలదని నాలుగు రోజులు పని చేసి ఆపేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం వారితో చర్చలు జరిపి రూ.16 వేలు నుంచి రూ.21 వేలు వేతనంగా చెల్లిస్తోంది. అందులోనే ప్రతినెలా రేషన్ వాహనానికి సమకూర్చిన రుణానికి వాయిదా సొమ్ముగా రూ.3 వేలును జమ చేసుకుంటోంది.

సమయ వేళలు పెంపు...గడువు కుదింపు

ఎండియు వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి ఒక రోజులో ఒక ఆపరేటర్ 90 నుంచి 120 కార్డుల వరకు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారు. ఉదయం ఎనిమిది నుంచి పంపిణీ మొదలు సాయంత్రం ఏడు గంటల వరకు సరుకులను ఇచ్చేవారు. ఒకటి నుంచి 17వ తేదీ వరకు నిత్యవసర వస్తువులను అందించేవారు. సర్వర్ల సమస్యలు, వర్షాలు వంటి కారణాలతో లబ్ధిదారులు ఆ సరుకులను అందుకోలేని పరిస్థితి ఉంటే.. ఒకటి, రెండు రోజుల పాటు పొడిగించేవారు. ఇప్పుడు మాత్రం ఈ నెలకు సంబంధించి పదో తేదీ నాటికే సరుకుల పంపిణీ పూర్తి చేయాలని ఆపరేటర్లకు ఫోన్ సందేశాలు పంపిస్తున్నారు. రోజూ 200 నుంచి 250 మంది కార్డుదారులకు కచ్చితంగా సరఫరా చేయాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

పనిభారం రెండింతలు పెంచేలా

సరుకుల పంపిణీకి గడువు కుదింపు, సమయ వేళలు పని చేయడంతో వారిపై పనిభారం రెట్టింపయ్యింది. సాంకేతిక ఇబ్బందులు, వర్షాలతో పాటు కాటా మిషన్ ఛార్జింగ్ సమస్యలు తలెత్తడంతో దీంతో ఆపరేటర్లు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్న పరిస్థితి నెలకొంది. మందస మండలం సవరరాజపురంలో రేషన్ వాహనంలో పనిచేసే హెల్పర్ ఒత్తిడికి లోనై ఛార్జింగ్ పెడుతూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఉదయం ఆరు గంటలకే పంపిణీ చేయాలంటే నాలుగు గంటలకే ఆపరేటర్స్ బయలుదేరి వెళ్లాల్సి ఉంటుందని చెప్తున్నారు. గ్రామాల్లో లబ్ధిదారులు అంతవేగంగా వచ్చే పరిస్థితి ఉండదని వారు అంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో సర్వర్లు పనిచేయని పరిస్థితి ఉందని, లక్ష్యం మేర కార్డుదారులు రేషన్ పంపిణీకి ఇబ్బందులు ఉన్నాయని వారు చెప్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సమయ వేళల పెంపు, గడువు కుదింపుతో సకాలంలో సరుకులు ఇవ్వలేకపోతున్నారనే అప్రతిష్ట లబ్ధిదారుల్లో కలిగించేందుకే ఉన్నతాధికారులు ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని వారు కోరుతున్నారు.

కించపరిచే వ్యాఖ్యలు మానుకోవాలి



రేషన్ పంపిణీ సమయ వేళలు పెంచడం, పదో తేదీలోగా ఇవ్వాలని ప్రభుత్వం చెప్పడంతో ఆపరేటర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. నలుగైదుగురు డీలర్ల పనిని ఇప్పుడు ఆపరేటర్లు చేస్తున్నారు. ఒక్కో ఆపరేటర్ 1500 నుంచి రెండు వేల మందికి సరుకులు అందిస్తున్నారు. ఆపరేటర్ల కష్టాన్ని గుర్తించకుండా నెలలో వీధి చివర వాహనం పెట్టి రెండు, మూడు రోజులే సరుకులు అందిస్తున్నారంటూ పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆపరేటర్లను కించపరచడం దారుణం. ఎండియు వ్యవస్థపై దురభిప్రాయం మార్చుకోవాలి.

- రౌతు సూర్యనారాయణ, ఎపి ఎండియు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు



సభలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పశ్చిమాసియా యుద్ధాన్ని నివారించాలి

నగరంలో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించాలని ప్రపంచ శాంతిని కాపాడాలని, పాలస్తీనా ప్రజలకు 1967 సరిహద్దుల ప్రకారం వారి సొంత దేశాన్ని ఇవ్వాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు భవిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని సూర్యమహల్ కూడలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు అఖిల భారత శాంతి సంఘం ఆధ్వర్యాన పాలస్తీనా సంఘీభావ ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీకి వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తినాపై జరుపుతున్న దాడులను ఖండించారు. అమెరికా అండతోనే ఇజ్రాయిల్ పశ్చిమాసియా ప్రాంతమంతా యుద్ధ వాతావరణంలో సృష్టిస్తోందని విమర్శించారు. భారతదేశ ప్రభుత్వం మోడీ నేతృత్వంలో ఇజ్రాయిల్ అనుకూల వైఖరి తీసుకుందని, ఇది స్వతంత్ర కాలం నుంచి మన దేశం అనుసరిస్తున్న పాలస్తీనాకి మద్దతిచ్చే వైఖరికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా భారత ప్రజలంతా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో నాయకులు వి.జి.కె.మూర్తి, కె.శ్రీనివాసు, మెహబుల్లా ఖాన్, షాను అర్షద్ జిలానీ ముజీబ్, కె.నాగమణి ఎం.ఆదినారాయణమూర్తి, ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

'దువ్వాడ' ఇంటి ముందు కుమార్తెల నిరీక్షణ

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్



కారులో నిరీక్షిస్తున్న కుమార్తె హైందవి

వైసిపికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నూతన గృహం ముందు ఆయన కుమార్తె దువ్వాడ హైందవి, మరో కుమార్తె మౌననిరీక్షణ చేపట్టింది. మండలంలోని అక్కవరం గ్రామ జాతీయ రహదారి పక్కన నిర్మించుకున్న నూతన గృహం ముందు గురువారం సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన ఈ నిరీక్షణ రాత్రి వరకు కొనసాగుతుంది. వివరాల్లోకి వెళ్తే... శ్రీనివాస్ కుటుంబ వ్యవహారాల నేపథ్యంలో ఎన్నికల ముందు కొన్నిఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఆయన భార్య, కుమార్తెలు వేరుగా ఉంటున్నారు. కొన్నిరోజుల తరువాత కుమార్తెలు ఆయనతో ఉండేందుకు సిద్ధమయ్యారు. దీంతో గురువారం శ్రీనివాస్ ఇంటికి కారులో వచ్చారు. శ్రీనివాస్ తలుపులు తీయకపోవడంతో ఇంటి బయట కారులోనే నిరీక్షించారు. తన తండ్రితో కలిసి ఉంటామని, ఇదే విషయం ఆయనను అడుగుదామని రెండుసార్లు చేశారు. అలాగే మెసేజ్‌లు కూడా పెట్టారు. అయినా స్పందించలేదు. అయితే తన తండ్రి నుంచి సమాచారం వచ్చినంత వరకు ఇక్కడే నిరీక్షిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కుమార్తెలు నిరీక్షిస్తున్న సమయంలో ఎప్పుడూ లైట్లతో వెలిగి ఉండే వైసిపి కార్యాలయంలో చీకట్లు చోటుచేసుకున్నాయి. దువ్వాడ నివాసంగా భావిస్తున్న గృహంలో ఆయనతోపాటు మరికొంత మంది వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. గేట్లు మూసివేయడంతో స్పష్టత రావడం లేదు. ఆయన కుమార్తెల ఈ నిరీక్షణ ఎంతవరకు కొనసాగుతుందో... ఈ వ్యవహారం ఎటు దారితీస్తుందోన్నది వెయ్యి డాలర్ల ప్రశ్న. దీంతో టెక్కలిలో చర్చనీయాంశమైంది.

12 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో రోజు రోజుకీ పెరుగుతున్న వాహనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌ను క్రమద్ధీకరించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణపై జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ నెల 12 నుంచి కొత్త ట్రాఫిక్ రూల్స్ అమలు చేయాలని ఆదేశించారు. ఇటీవల నగరంలో పర్యటించానని చెప్పారు. నగరంలో ఇరుకైన రోడ్లు, వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం, ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుదల చేయడం, వ్యాపార సముదాయాలు, తోపుడు బళ్లు రోడ్లపై నిలిపి వ్యాపారాలు చేయడం, పార్కింగ్ స్థలం లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబందనలు మారుస్తూ వాహనాలను దారిమళ్లించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల దారిమళ్లింపునకు ట్రాఫిక్ విభాగం దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రధానంగా ఆమదాలవలస నుంచే ఆటోలు, కార్లు, భారీ వాహనాలు బలగ, ఆస్పత్రి ఆర్ట్స్ కాలేజీ మీదుగా అంబేద్కర్ కూడలి వద్దకు చేరుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆటోలను ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాల్లో నియంత్రించడంతో నిత్యం రద్దీగా ఉండే జడ్జి బంగ్లా, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్‌ను తగ్గించగలమని అన్నారు. శ్రీకాకుళం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయివేట్ ట్రావెల్ బస్సులు కొత్తరోడ్ వద్దకు చేరుకొని జాతీయ రహదారిపైకి వెళ్లి విశాఖపట్నం వైపునకు వెళ్లాలన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వైపునకు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు నియంత్రించడంతో సాయంత్రం రద్దీ సమయంలో ఆర్‌టిసి కాంప్లెక్స్, డే అండ్ నైట్ కూడలి, కొత్త బ్రిడ్జి డౌన్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించగమని అన్నారు. అలాగే సింహద్వారం నుంచి కిమ్స్ ఆస్పత్రి మీదుగా నగరంలోకి వచ్చు వాహనాల్లో ఆర్ట్స్ కాలేజీ వైపుకు వెళ్లాల్సిన వారు బ్రిడ్జి డౌన్‌లోని ఎడమ వైపుకు టర్న్ తీసుకుని ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చేరుకోవాలాన్నారు. ఎ1 హోటల్ కూడలి నుంచి సిందూరు ఆస్పత్రి రోడ్డులోకి వాహనాలు అనుమతించవద్దని ఆదేశించారు. ఎ1 హోటల్ కూడలి మీదుగా కొత్త బ్రిడ్జి వైపునకు గల సిందూర ఆస్పత్రి రోడ్డును వన్‌వే రోడ్డుగా వినియోగించాలన్నారు. ఆంక్షలను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలకు లోబడి సహకరించాలని కోరారు.

తుపాకీ లైసెన్స్ మంజూరు చేయాలి

ఎస్‌పికి దరఖాస్తు చేసుకున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి- టెక్కలి

ఎమ్మెల్సీగా ఉన్న తనకు ఆత్మరక్షణ నిమిత్తం తన వద్ద ఉన్న తుపాకీకి లైసెన్స్ మంజూరు చేయాలని కోరుతూ దువ్వాడ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు జూన్ 12న కలెక్టర్ రాసిన లేఖలో తన తుపాకీకి లైసెన్స్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డికి బుధవారం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అక్కవరం గ్రామం వద్ద ఉన్న తన నూతన గృహం ముందు పరశురాంపురం, చల్లపేట, టెక్కలి గ్రామాలకు చెందిన వ్యక్తులు రిక్కీ నిర్వహిస్తున్నారని, వారి నుంచి తనకు ప్రాణభయం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా తనకు చెందిన రెండు మొబైల్స్‌కు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై జూలై 16న టెక్కలి పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశానని అన్నారు. తన ఆత్మ పరిరక్షణ దృష్ట్యా తనకు తుపాకీకి లైసెన్స్ మంజూరు చేయాలని ఫిర్యాదు చేశామని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసిని ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలని, తద్వారా సంపద సృష్టించుకునేందుకు అవకాశం కలుగుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. విజయవాడకు బస్సు మాదిరిగానే తిరుపతికి కూడా బస్సు సౌకర్యాన్ని కల్పిస్తే సిక్కోలు వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సూపర్-6ను కచ్చితంగా టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని అన్నారు. ఇప్పటికే పింఛను రూ.4 వేలు చేసిందన్నారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళలకు బస్సు ప్రయాణ సౌకర్యాలు కూడా కల్పిస్తామని వివరించారు. దీనికోసం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్త బస్సును కొనుగోలు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం ఎందుకు కొత్త బస్సులను కొనుగోలు చేయకుండా, సిబ్బంది పెంచకుండా ఆర్‌టిసి నిర్వీర్యం చేసిందన్నారు. గత ప్రభుత్వ పాలన అంతా బటన్ నొక్కుడు... నిధులు బొక్కుడుగానే సాగిందని విమర్శించారు. ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దశాబ్దాల కాలంగా కాంప్లెక్స్ వర్షం నీరు నిలిచిపోయే దుస్థితి నెలకొందని తెలిపారు. వర్షపునీటిని డ్రెయినేజీల ద్వారా నదిలోకి మళ్లించేందుకు ఇప్పటికే కార్పొరేషన్ కమిషనర్‌కు వివరించామని చెప్పారు. త్వరలో కాంప్లెక్స్ సమస్యలు పరిష్కరించి ప్రయాణికులకు, సిబ్బంది మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీనిచ్చారు. ఇయు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నర్సయ్య, జిల్లా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దింటి కిరణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలన్నీ తమ సొంత నిధులైన పొదుపు నుంచి సభ్యులు అవసరం మేరకు అప్పు తీసుకోవాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి సంఘాల్లో అర్హులందరికీ ఉన్నతి నుంచి రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. సభ్యులు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. మహిళా మార్టుకు సంబంధించి మంచి ప్రణాళిక ప్రకారం సంఘ సభ్యులందరి భాగస్వామ్యంతో వ్యాపారాన్ని ప్రారంభించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు విల్లింగ్‌తో సంఘ సభ్యులు ఏర్పాటు చేయబోతున్న యూనిట్లకు సబ్సిడీని మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం కూర్మారావు, ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్, డిపిఎం నారాయణరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

పోలీస్ క్యాంటీన్ పరిశీలన



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని పోలీసు సిబ్బంది సంక్షేమంలో నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల రోడ్డు మార్గంలో నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది విశ్రాంతి భవనం, సబ్సిడీ పోలీస్ క్యాంటీన్‌ను గురువారం ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి విశ్రాంతి భవనం నిర్వహణ, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. విధినిర్వహణలో భాగంగా హెడ్ క్వార్టర్స్‌కు వచ్చే సిబ్బంది అందరూ విశ్రాంతి తీసుకున్నందుకు అనుకూలంగా ఉండేటట్లు చూడాలన్నారు. సిపిసి పోలీస్ క్యాంటీన్‌లో అందుబాటులో ఉండే వస్తు సామగ్రి, కిరణా సరుకులను పరిశీలించి సిబ్బందికి ఉపయోగపడే నాణ్యమైన వస్తువులు జిల్లాలో అందరకు సరిపడే వస్తు సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది ప్రతినెలా మొదటి వారంలో సరుకులను అందించాలని సూచించారు.

మళ్లీ తెరపైకి పలాస సబ్ డివిజన్

- రద్దు కాని గత జిఒ
- ప్రభుత్వ హామీపై ఉపాధ్యాయుల్లో ఆందోళన

టెక్కలి: టెక్కలి డివిజన్ విద్యాశాఖ కార్యాలయం విభజన అమలు కానుంది. ఇప్పటివరకు టెక్కలి డివిజన్ విద్యాశాఖ పరిధిలోని మండలాలను విభజిస్తూ... పలాస సబ్‌డివిజన్ ఉపవిద్యాశాఖా ధికారి కార్యాలయం ఏర్పాటుపై గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా ఉన్న విలియమ్స్‌ని పలాస డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఇన్‌ఛార్జిగా బాధ్యతల ు స్వీకరించమని జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ జారీ అయ్యాయి. టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖ కార్యాలయం పరిధిలోని ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, ఎల్‌ఎన్‌పేట, కొత్తూరు మండలాలు టెక్కలి డివిజన్ ఉపవిద్యా శాఖాధికారి కార్యాలయం పరిధిలో ఉండేవి. తాజాగా పలాస సబ్ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం విభజన నేపథ్యంలో ఇచ్ఛాపురం నుంచి నందిగాం మండలాల వరకు పలాస సబ్‌డివిజన్ ఉపవిద్యాశా ఖాకార్యాలయం పరిధిలోకి రానుం డగా, తాజాగా టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయం పరిధిలోకి కోటబొమ్మాళి మండలం చేరనుంది. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తామని చెబుతూ గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఒ ప్రకారం ఈ ఆదేశాలు జారీ కావడం గమనార్హం. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే 117 జిఒను రద్దు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీని చ్చింది. అధికారంలోకి వచ్చిన రెండు నెలలు తరువాత అదే జిఒను అమలు చేసింది. దీంతో సంఘాలు ప్రభుత్వ తీరుపై ఆసహనం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఒ వల్ల విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిఒను రద్దు చేస్తామని ఉపాధ్యాయ సంఘాలకు హామీనిచ్చింది. దీంతో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయు లు టిడిపి కూటమి ప్రభుత్వానికి మద్దతు నిచ్చాయి. కానీ, ఈ జిఒ అమలు అదే జిఒ అమలు చేయడంతో ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉపాధ్యాయుల పనిసర్దుబాటు తనం ఉండడం వల్ల పనిపూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పలాస ఉపవిద్యాశాఖ కార్యాలయం పరిధి మళ్లీ తెరమీదకి వచ్చిందని భావిస్తున్నారు. ఎప్పటికైనా ఆ జిఒ అమలైతే పలాస ఉపవిద్యాశాఖాకార్యాలయం ఏర్పాటు కావడం ఖాయమని భావిస్తున్నారు.



అగరబత్తి తయారీని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

వికలాంగులకు న్యాయ సహాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి ఎటువంటి న్యాయ సహాయమైనా ఉచితంగా అందించేందుకు న్యాయసేవాధికారి సంస్థ లీగల్ విభాగం సిద్ధంగా ఉందని, అవసరమైన వికలాంగులు సంప్రదించి ఈసేవలను వినియోగించుకోవాలని సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు సూచించారు. నగరంలోని బెహరామనో వికాస కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న వికలాంగులు తయారు చేస్తున్న అగరబత్తీలను పరిశీలించారు. అక్కడ సౌకర్యాలను పరిశీలించిన ఆయన వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. భోజన, వసతి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వారికి పండ్లు అందజేశారు. ఆయన వెంట ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణపతిరావు, బలరాం

మున్సిపల్ కార్మికులను పెంచాలి

ప్రజాశక్తి- పలాస

పెరుగుతున్న మున్సిపాలిటీలో తగినంత మంది శానిటేషన్ కార్మికులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.బలరాం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. స్థానిక మంకినమ్మ ఆలయ ఆవరణలో మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా కార్మికులు లేకుండా పాత వారితోనే పనులు చేయించడంతో కార్మికులపై పనిభారం పెరుగుతుందన్నారు. పనిచేయడానికి పని ముట్లు కూడా ఇవ్వకుండా పనిచేయించడం సరైన పద్ధతి కాదన్నారు. పిఎఫ్ఇఎస్ఐ కార్మికులకు అన్ని సందర్భాల్లో ఉపయోగపడేలా సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అవసరమైతే ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.గణపతి, గౌరవ సలహాదారుగా సిహెచ్.మురగన్, అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వెంకట్, బి.కూర్మారావు, కోశాధికారిగా ఎం.రవి, కార్యవర్గ సభ్యులుగా కె.ఈశ్వరరావు, ప్రకాష్‌ముఖి, ఎస్.రమేష్, పి.బాలకృష్ణ, పి.సీతామ్మ, ఎస్.బానమ్మలను ఎన్నుకున్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండియు ఆపరేటర్లు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- బూర్జ

ఎండియు ఆపరేటర్ల సమస్యలను సత్వరమే పరిష్కారం చూపాలని ఎండియు ఆపరేటర్ల మండల సంఘ అధ్యక్షుడు హేమసుందర్ కోరారు. గురువారం ఎండియు ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఎండియు ఆపరేటర్స్ రేషన్ డిస్ట్రిబ్యూషన్ సమయంలో ఈ పాస్ మిషన్‌లో బిల్లు తీసే పేపర్‌రోల్స్ ఆపరేటర్స్‌కి ఇవ్వడం లేదని, వాటివలన ఆదనంగా ఆపరేటర్స్‌కి ఆర్థిక భారం పడుతుందన్నారు. అలాగే రేషన్ వాహనాల్లో ఉండే కాటన్ మిషన్స్ స్పేర్‌పార్ట్స్ అందుబాటులో లేనందున డీలర్ కాటన్ మిషన్‌తో డిస్ట్రిబ్యూషన్ చేయడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, స్పేర్‌పార్ట్స్ త్వరగా వచ్చే విధంగా చూడాలన్నారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రతి నెల బూర్జ మండలం మొదటి స్థానంలో డిస్ట్రిబ్యూషన్ కంప్లీట్ చేయడంపై ఆపరేటర్లకు అభినందించారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో పొన్నాడ రాము, కాయల రాంబాబు, ఎన్.జనార్ధన్, గేదెల రాజేష్, ఎస్ రంగారావు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన సొసైటీ స్థలాన్ని ఎమ్మెల్యేకు చూపిస్తున్న చేనేత కార్మికులు

చేనేత సహకార సొసైటీ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి- లావేరు

అప్పాపురం గ్రామంలో ఉన్న చేనేత సహకార సొసైటీ స్థలాన్ని వైసిపి నాయకులు ఆక్రమించి అక్రమ నిర్మాణలు చేశారని తమకు బట్టలు నేసేందుకు, సరులు వేసేందుకు స్థలం లేకపోవడంతో తమ వృత్తికి ఇబ్బందులు ఏర్పడ్డాయని అప్పాపురం చేనేత కార్మికులు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ముందు వాపోయారు. వెంటనే ఎమ్మెల్యే ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవిన్యూ అధికారులతో సర్వే చేయిస్తామని, ఆ స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించి అందులో చేనేతకు వర్క్‌షెడ్‌లు నిర్మిస్తామని, వృత్తికి అనుకూలంగా లోపల సరులు వేసుకునేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు, చేనేత కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్, చేనేత కార్మికులు బాసిన దాలిరాజు, అప్పలస్వామి, బట్ట శ్రీను, అప్పన్న, గ్రామస్తులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఇటీవల కాలంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు మూల తాతయ్య, సంపతరావు అప్పలరాజు, వడగ భాస్కరరావు, బాలక రామారావులను గురువారం సంఘం భవనంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి ధనుంజయరావు, విశ్రాంత ఉద్యోగులు జి.వి.రెడ్డి, అనిశెట్టి చిట్టెన్న, దూసి ఆంధ్రాస్టాలిన్ బొడ్డ అయ్యబాబు, రెయ్యి పున్నయ్య, కోరాడ మోహనరావు, దల్లి మోహనరావు, దల్లి వీరాస్వామిరెడ్డి పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విత్తన శుద్ధి చేయటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తిరుపతిపాలెంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తిని సాధించడం, తక్కువ పురుగు మందుల వాడకం, ఎరువులు వినియోగం తగ్గించడం, సరైన సమయంలో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ అధికారుల సలహాలు వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో అగ్రి ల్యాబ్ ఇన్‌ఛార్జి సుహాసిని, సర్పంచ్ ఆకుల రవి, మాజీ సర్పంచ్ మండల రాముునాయుడు, రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఎస్‌ఎంసి ఎన్నిక పాఠశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎస్‌ఎంసి చైర్‌పర్సన్‌గా బాలి సత్యవతి, వైస్ చైర్మన్‌గా పి.సూర్యారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలో 85 జెడ్‌పి, ఎంపిపి పాఠశాలలు ఉండగా 81 పాఠశాలల్లో ప్రశాంతంగా ఏకగ్రీవంగా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగిందని ఎంఇఒ-2 మురళీకష్ణ తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు జరగలేదని ఎంఇఒ తెలిపారు.

బూర్జ: మండలంలో వివిధ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎంఇఒ ధనుంజయరావు తెలిపారు. మండలంలో 63 పాఠశాలకుగాను 61 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

ఎచ్చెర్ల: మండలంలో కేశవరావుపేట జెడ్‌పి పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎస్‌ఎంసి చైర్మన్‌గా అన్నెపు లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా మెట్ట అమ్మాజీతో పాటు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.వి.ఎస్ సాయిరాం, ఎంపిటిసి సూర జగదీష్, సర్పంచ్ పైడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, జనసేన ప్రతినిధి శ్రీనివాసరావు, పాపారావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 90 శాతం స్థానాలు ఏకగ్రీవంగా



ఇచ్ఛాపురం : వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

కమిటీలు ఎన్నికయ్యాయి. కొన్నిచోట్ల వాయిదా పడింది. ఈ సందర్భంగా ఎన్నికయిన కమిటీ ప్రతినిధులకు ఎమ్మెల్యే ఈశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

సరుబుజ్జిలి: మండలంలో మొత్తం 53 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 40 పాఠశాలల్లో పిఎంసి కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆరు పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎంఇఒ డి. బాలరాజు తెలిపారు.

పొందూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఎస్‌ఎంసి ఎన్నికలు పలుచోట్ల స్వల్ప వివాదాల నడుమ సాగాయి. మండలంలోని 66 పాఠశాలలకు ఎన్నికలను నిర్వహించగా 65 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తిచేసి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. తాణెం ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేక పోవడంతో వాయిదా పడినట్లు ఎంఇఒ రామరాజు తెలిపారు.

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 67 ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అందులో 64 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా కాగా, 18 పాఠశాలల్లో పోటీలుజరిగాయి. పోలీసులు కొన్ని పాఠశాలల వద్ద బందోబస్తు నిర్వహించారు. ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు ఎన్నికలను పర్యవేక్షించారు.

ఆమదాలవలస : మండలంలోని తొగరాం పంచాయతీ ఇసకలపేట స్కూల్‌లో విద్యా కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో చైర్‌పర్సన్‌గా అన్యపు స్వర్ణలత, వైస్ చైర్‌పర్సన్‌గా సింగపురపు మణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో ప్రధానోపాధ్యాయులు బి.సుగుణాదేవి ప్రమాణస్వీకారం చేయించారు.

ఆమదాలవలస మండలం, మున్సి పాలిటీలో 99 యుపి ప్రైమరీ జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 95 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. చైర్మన్లు, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.

ఇచ్ఛాపురం : పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల డి.వైకుంఠరావు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన చైర్మన్ తిప్పన దుర్యోధనరెడ్డి అన్నారు. అలాగే మున్సిపాలిటీ, మండలంలోని 70 పాఠశాలల్లో, 27 చోట్ల ఏకగ్రీవంగా, 41 స్కూళ్లలో ఎన్నికలు నిర్వహించామని, మిగతా రెండు స్కూళ్లల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని ఎంఇఒ అప్పారావు తెలిపారు. మండలంలోని హరిపురం స్కూల్‌లో నిర్వహించిన విద్యాకమిటీ ఎన్నికల నిర్వహణను కాశీబుగ్గ డిఎస్‌పి శ్రీనివాసరావు పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని 65 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 17 ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఎంసి ఎన్నికలు జరిగాయి. మొత్తం 91 పాఠశాలలకు గాను, 80 పాటశాలలో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11 చోట్ల ఓటింగ్ నిర్వహించారు. కమిటీ చైర్మన్, ఉప చైర్మన్లతో పాటు సభ్యులు అందరూ కలిపి 1299 మంది ఎన్నికయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ బి.వెంకటరావు తెలిపారు.

హిరమండలం: మండలంలో కల్లటలో ఎంపిపి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా సారిపల్లి శంకరరావు ఎన్నికయ్యారు. ఆయనను హెచ్‌ఎం అన్నాజీరావు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర హైస్కూల్ లో ఎన్నికల అధికారి బి.రామకృష్ణ అధ్వర్యాన జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా గన్నవరపు గోవిందరావు, వైస్ చైర్మన్‌గా కొత్తూరు శ్యామల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తోటాడలో చైర్మన్‌గా ఎర్నాగుల సాయిరాజు, వైస్ చైర్మన్‌గా ఎర్నాకుల రజిని, పాతమేఘవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గాడి లక్ష్మి, సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల చైర్మన్‌గా అల్లు భాస్కరరావు, వల్లేవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైర్మన్‌గా ఇప్పిలి అప్పన్న ఎన్నికయ్యారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.చైతన్య ఎన్నికల అధికారిక వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో



ఆమదాలవలస : ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం సుగుణవేణి

చైర్‌పర్సన్‌గా కొండాల భారతి, వైస్ చైర్మన్‌గా బాలక బాలరాజు, నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా కర్రి గిరిబాబు, వైస్ చైర్‌పర్సన్‌గా తిప్పాన ధనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేశినాయుడుపేట పాఠశాలలో హెచ్‌ఎం గిరిధరరావు ఆధ్వర్యాన చైర్మన్‌గా సిహెచ్.గౌతమి, వైస్ చైర్మన్‌గా టి.శంకరరావు ఎన్నికయ్యారు. జగన్నాథంపురం పాఠశాలలో హెచ్‌ఎం జయకృష్ణ ఆద్వర్యాన చైర్‌పర్సన్‌గా రెయ్యి స్వాతి, వైస్ చైర్‌పర్సన్ రెయ్యి లక్ష్మి, తోటాడలో చైర్మన్‌గా ఎర్నాగుల సాయిరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా ఎర్నాకుల రజిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మెళియాపుట్టి : మండలంలో అధిక సంఖ్యలోని పాఠశాలల్లో జరిగిన విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అందులో చైర్మన్ పదవులను ఎక్కువగా టిడిపి నాయకులే కైవసం చేసుకున్నారు. గొప్పిలి, కరజాడలో పాఠశాలల్లో స్వల్ప ఘర్షణలు జరిగిన తర్వాత ఏకగ్రీవంగా జరిగాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, జిటిఎస్ కలిపి 108 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. సమస్యాత్మక గ్రామాలైన చాపర, జాడుపల్లి, కరజాడ, గొప్పిలి, పి ఎల్ పురం, కొసమాల తదితర గ్రామాల్లో ఎన్నికల దృష్ట్యా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మందస : మండలంలోని నిర్వహించిన స్కూల్ కమిటీ మేనేజ్‌మెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దున్నూరు, నారాయణపురం, అంబుగాం, లోహిరిబంద, భేతాలాపురం, గొల్లలపాలెం, బహడపల్లి, సొండిపూడిలో ఎన్నికల పరిశీలుకుడుగా ఎంఇఒ లక్ష్మణరావు వ్యవహరించారు.

పెంటవీధి పాఠశాలలో గందరగోళం

మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని నిరసన

పలాస : కాశీబుగ్గ పెంట వీధి పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక గందరగోళం నెలకొంది. టిడిపి, వైసిపి, జనసేన పార్టీ నాయకులను పోలీసులు చెదరగొట్టారు. స్కూల్ కమిటీ చైర్మన్‌గా పొందర పాపారావు, సిహెచ్.శ్రీనివాస్, బూరగాపు గౌతమి పోటీ చేశారు. పాపారావుకు 10, శ్రీనివాస్‌కు పది, గౌతమికు 3 ఓట్లు పోలయ్యాయి. ఒకటి చెల్లని ఓటు పడింది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకా ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేయాలని సూచించారు. అందుకు అభ్యర్థులు ఒప్పుకోకపోవడంతో మరలా ఎన్నిక నిర్వహించారు. తర్వాత నిర్వహించే ఎన్నికలో శ్రీనివాస్‌కు 13, పాపారావుకు పది, గౌతమికి ఒక ఓటు పడింది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తలిదండ్రులు మరలా ఎన్నిక నిర్వహించాలని పాఠశాల వద్ద నిరసన తెలిపారు. దీంతో మొదటి సమావేశం నిర్వహించాల్సి ఉండగా, కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. ఆ సమయంలో ఎన్నిక వాయిదా వేయాలని తల్లిదండ్రులు చేపడుతున్న నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న



పలాస : నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కాశీబుగ్గ సిఐ విజయానంద్ తల్లిదండ్రులను పాఠశాల వద్ద నుంచి పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

37 పాఠశాలలో ఏకగ్రీవం

మండలంలోని 63 ప్రాథమిక, 11 యూపి, ఉన్నత పాఠశాలు 10 ఉండగా, అందులో 37 పాఠశాలలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 47 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి పాఠశాల వద్దా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నందివాడలో కొట్లాట

పొందూరు: నందివాడలో ఎస్‌ఎంసి ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఎన్నిక పూర్తయిన తరువాత టిడిపిలోని రెండు వర్గాలు మధ్య కొట్లాట చోటుచేసుకుంది. గెలిచిన వర్గానికి, ఓడిపోయిన వర్గానికి మధ్య గత ప్రభుత్వ హయాంలో వాహనమిత్ర పథకం ద్వారా ఇచ్చిన ట్రాక్టర్‌కు సంబంధించి వివాదం నెలకొన్నది. దీంతో ఇరువర్గాలు కర్రలతో కొట్లాటకు దిగారు. ఇందులో ఒక వర్గానికి చెందిన మజ్జి మోహన్ తలకు గాయం కావడంతో పాటు అలాగే మరో వర్గానికి చెందిన వారికి కూడా స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలు చికిత్స కొరకు 108 వాహనం ద్వారా శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా సిఐ దివాకర్ యాదవ్, ఎస్ఐ.వెంకటరమణలు గ్రామాన్ని సందర్శించి పరిశీలించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీనిపై ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్టేనని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో శంకర్ గురువారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు మౌలిక సదుపాయాలకు నోచుకోక ఎక్కడ వేసిన గంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. గ్రామాలు అంటువ్యాధులకు ఆనవాళ్లుగా మారిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామాల్లో అపారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు సైతం ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో రాష్ట్రంలో మరళా గ్రామాలకు పూర్వవైభవాన్ని తీసుకొస్తామన్నారు. గత పాలక ప్రభుత్వం సర్పంచ్‌ల విధులు, నిధులు, హక్కులు కాలరాసిందని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, మండల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పొందూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సర్పంచ్‌లు, కార్యదర్శిలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి పి.సింహాచలం పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ముగిసిన ఆర్‌జిఎస్‌ఎ శిక్షణ

సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా తరగతుల కార్యక్రమం మొదటి రోజు తూతూ మంత్రంగా కొనసాగడంపై పలువురు సర్పంచ్‌లు పెదవి విరుస్తున్నారు. మొదటిరోజు శిక్షణకు రిసోర్స్ పర్సన్ హాజరు కాలేదు. దీనికి కోర్సు డైరెక్టర్‌గా ఎంపిడిఒ, సహాయ కోర్సు డైరెక్టర్‌గా ఇఒపిఆర్‌డి వ్యవహరించి పర్యవేక్షణ చేయాలి. మొదటి రోజు శిక్షణకు ఇఒపిఆర్‌డి హాజరు కాలేదు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఉదయం 11 గంటలకు ముగ్గురు సర్పంచ్‌లు, ఇద్దరు ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్న భోజన సమయానికి మరో ముగ్గురు హాజరయ్యారు. మిగిలిన 13 మంది సర్పంచ్‌లు హాజరు కాలేదు.

ఆమదాలవలస: ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎన్ఐఆర్‌డి పరిశీలకులు కె.నాగరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆర్‌జిఎస్‌ఎ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణలో పంచాయతీ విధులు, అధికారాలు బాధ్యతలు, పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణలో పంచాయతీల పాత్ర, చెత్త సేకరణ తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీకంపోస్టు తయారీ విధానం, ఎల్ఇడి వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు. డిపిఆర్‌సి జిల్లా కో-ఆర్డినేటర్ పి.వెంకటరాజు శిక్షణ కోర్సు కో-ఆర్డినేటర్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, డిఒపిఆర్‌డి దుంపల గోవిందరావు, రిసోర్స్ పర్సన్లుగా బి.నాగరాజు బి.స్టాలిన్, వి.విక్రమ్, పి.రాము, టి.అభిలాష్ శిక్షణ నిర్వహించారు.



నందిగాం : మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు

నందిగాం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ టి. రాజారావు అధ్యక్షతన సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు సంతోష్ కుమార్, దిల్లేశ్వరరావు మాస్టర్ ట్రైనీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంజీవరావు, మల్ల సీతారాం, కార్యదర్శి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక పరిశీలకులు కృష్ణమూమోహన్ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, ఎంపిడిఒ ఉషశ్రీ, ఇఒపిఆర్‌డి పద్మావతి, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, దేవరాజు పాల్గొన్నారు.

పలాస : మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు డిపిఒ ఐ.వి.రమణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, సద్గుణబాబు తదితరులు పాల్గొన్నారు.

మందస : మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు టెక్కలి డిపిఒ ఐ.వి.రమణ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘుపతిరావు, కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.



గుర్తు తెలియని మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పలాస : పలాస-సుమ్మాదేవి రైల్వే స్టేషన్ల మధ్య గురువారం మధ్యాహ్నం రైలు కింద పడి 50 ఏళ్ల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ షరీష్ తెలిపారు. మృతదేహం పలాస ప్రభుత్వాస్పత్రిలో భద్రపరిచామన్నారు. మృతునికి సంబంధించిన వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కృష్ణదాస్

వైసిపి కార్యకర్త మృతి

కోటబొమ్మాళి : మండలం తాటిపర్తిలో వైసిపి నాయకులు మెండ భాస్కరరావు గురువారం మృతి చెందారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఈయనతో పాటు ముద్దాడ భాస్కరరావు, పొన్నాన దాలినాయుడు, వరుదు వంశీకృష్ణ, ధర్మాన జగన్, కణుసు సీతారాం, యాళ్ల శ్యామసుందర్, గొండు మురళి పాల్గొన్నారు.

ప్రలోభాలకు లోను కావద్దు

బూర్జ: విద్యార్థినిలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని కొల్లివలస కెజిబివి పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత కొన్ని వస్తువులపై ఆకర్షితులు అవుతున్నారన్నారు. దీనివలన తమ బంగారు భవిష్యత్ నాశనం చేసు కుంటున్నారని వివరించారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో జీవిస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయొద్దన్నారు. మొబైల్, ఇతర సాంకేతిక పరమైన వస్తువులను వినియోగించకుండా ఉండాలన్నారు. కెజిబివి ఎస్ఒ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో అనర్థం

లావేరు: పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి అనర్థ దాయకమని బుడుమురు జెడ్‌పి పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు, ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. గురువారం పాఠశాలలో పొగాకు వాడకం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు వివరించారు. పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీలు, గుట్కా వాడటంవలన వచ్చే అనర్థాలను వివరించారు. హెచ్‌ఎం ఉరిటి శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, ఎం.అనురాధ, కె. వెంకటరావు, పి.తమ్మినాయుడు, కూన చిన పెంటయ్య, ఎస్.రమేష్‌బాబు, కె. చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గోవిందరావు

డిగ్రీ కళాశాలలో ఆక్రమణలు తొలగిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఆక్రమణలు తొలగించి డిగ్రీ కళాశాల సంపూర్ణ అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం పట్టణానికి చెందిన ఆడిటర్ బుడుమూరు శ్రీనివాసరావు డిగ్రీ కళాశాలకు విరాళంగా ఇచ్చిన కంప్యూటర్ ల్యాబ్‌ను రవికుమార్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎన్ స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడంతో పాటు యువతకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని కనకాద్రి చెరువులో డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం సుమారు ఐదెకరాల భూమి కేటాయించగా కళాశాల పరిసర ప్రాంతాలన్నీ ఆక్రమణలకు గురి కావడంతో భవిష్యత్‌లో డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఆటంకాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే డిగ్రీ కళాశాల స్థల ఆక్రమణలన్ని తొలగించి సుమారు రూ.6 కోట్లతో డిగ్రీ కళాశాల ప్రహరీ గోడ, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆమదాలవలస జోన్ సత్యసాయి సేవాసమితి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఆడిటర్ శ్రీనివాసరావు సత్యసాయి సేవా సమితికి రూ.5 లక్షలు అంతిమయాత్ర వాహనం సమకూర్చడంతో పాటు ఆర్థిక సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, టిడిపి నాయకులు కూన భానోజీరావు, సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, నాగళ్ల మురళీధర్, సత్యసాయి సేవాసమితి సభ్యులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నజొన్నవలసలో పశువైద్య శిబిరం

ఆమదాలవలస: శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన పశుసంవర్ధక పాలిటెక్నిక్ వెన్నెలవలస ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 16 వరకు జరిగే ప్రత్యేక జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా గురువారం చిన్న జొన్నవలసలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ పశు వైద్య శిబిరంలో వివిధ పశు వ్యాధులు, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేసారు. పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వి.రమణమూర్తి, పశుసంవర్ధక



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మోహన్ వంశీ, పశు వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ హేమలత, శిక్షణలో ఉన్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ రోడ్డు మున్సిపాలిటీదే

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ గాంధీనగర్లో ఆక్రమణలో ఉన్న భూమి రహదారేనని పలాస కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. 14 ఏళ్లుగా మున్సిపల్ అధికారులు చేస్తున్న పోరాటానికి ఊరట లభించింది. 40 అడుగుల వెడల్పుగా ఉన్న ఈ రహదారిలో కెటి రోడ్డు వైపు రెండు వేల చదరపు అడుగుల స్థలం తమదని, ఇది తమకు వారసత్వంగా సంక్రమించిందని ఓ వ్యాపారి షాపులు పెట్టారు. ఈ రోడ్డులోని గృహాలు, వ్యాపార సంస్థలకు చెందిన రికార్డులన్నీ రోడ్డుగా చూపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వివాదంలో ఉన్న భూమిపై ఎటువంటి అభివృద్ధి చేయలేకపోయారు. 2010లో భూ వివాదంపై మున్సిపల్ అధికారులు, వ్యాపారి మధ్య కోర్టు వివాదం నడుస్తుంది. గురువారం తుది తీర్పు వెలువడి అది రహదారిగానే పరిగణించాలని కోర్టు ఆదేశించింది. దీంతో మొత్తం రోడ్డు అభివృద్ధి చేయడానికి మార్గం సుగమమైంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా, కోర్టు తీర్పు మున్సిపాలిటీకి అనుకూలంగా వచ్చిందన్నారు. దీనిపై ఇంకా న్యాయపరమైన చిక్కులు ఉంటే తక్షణం పరిష్కరించడానికి న్యాయవాదులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. త్వరలో దీనికి మోక్షం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నౌపడ: సంతబొమ్మాళి మండల వ్యాప్తంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని టెక్కలి విద్యుత్ శాఖ ఇఇ శంకరరావు ప్రకటనలో తెలిపారు. సంత బొమ్మాళి, నౌపడ, బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగి స్తున్నామని చెప్పారు. దీని కారణంగా ఆయా సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహక రించాలని కోరారు.

మెళియాపుట్టి : విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ 11 కెవి ఫీడర్ పరిధిలోని మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి విద్యుత్ శాఖ ఇఇ జి.శంకరరావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుంద న్నారు. విద్యుత్ విని యోగదారులు సహకరించాలని కోరారు.

మందస : మందస సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇ ప్రకటనలో తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్: ఎచ్చెర్ల మండలం ఇండస్ట్రియల్ ఫీడర్‌తో పాటు కొత్తపేట 11 కెవి ఫీడర్, పొందూరు మండలం కింతలి, తాడివలస విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 33 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కింతలి, కనిమెట్ట, తోలాపి, ధర్మపురం, దళ్ళవలస, పిల్లలవలస, పెనుబర్తి, అచ్చి పోలవలస, మొదలవలస, బొడ్డేపల్లి, తాడివలస, గోరింట, లైదాం, తుంగపేట, గోకర్నపల్లి పంచాయతీల్లో పలు గ్రామాలకు, శ్రీకాకుళం నగర పరిధిలో హడ్కో కాలనీ 11 కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఇపిడిసిఎల్ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని 45వ డివిజన్ ఇన్‌ఛార్జి నల్లాన మధుప్రకాష్ తెలిపారు. నగరంలోని చౌదరి సత్యన్నారాయణ కాలనీ 45 వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వలన తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదేవిధంగా తల్లికి రొమ్ము కేన్సర్ వంటివి రావని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.కృష్ణకుమారి, బి.లక్ష్మీ డి. సంతోష్, శివాజీ, అంజిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

117 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు నియమ నిబంధనలు 117 జిఒను రద్దు చేయకుండానే, ఆ జిఒకు అనుగుణంగా రూపొందించడం గత ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్ధించడమేనని తక్షణమే ఈ జిఒను రద్దు చేసిన తర్వాత పని సర్దుబాటు చేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరి ప్రసన్న, పేడాడ కృష్ణారావులు ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సమాయత్తం కావడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. జిఒలోని అసంబద్ధమైన ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి, ఆంగ్లభాషా మాధ్యమం, సెక్షన్ల విధానం తదితర అంశాలను సవరించకుండానే పని సర్దుబాటు చేయడం వలన విద్యారంగానికి తీవ్ర విఘాతం కలుగు తుందన్నారు. వెంటనే 117 జిఒను రద్దు చేసి, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, పని సర్దుబాటు అయ్యే విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్కూల్ బస్సు తనిఖీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో ఇటీవల ప్రయివేటు విద్యా సంస్థకు చెందిన స్కూలు బస్సు బోల్తా పడింది. దీంతో రవాణాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రవాణాశాఖ అధికారి అనీల్, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, ఎంఇఒ అప్పారావులు జాయింట్ యాక్షన్ కమిటీగా గురువారం స్కూల్ బస్సులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బస్ ఫిట్‌నెస్, డ్రైవర్ల అనుభవాలు, అలవాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీల్‌చైర్ వితరణ

ఇచ్ఛాపురం : తన తండ్రి జన్మదిన సందర్భంగా తనయుడు నిరుపేద వికలాంగునికి వీల్‌చైర్ వితరణ చేశారు. 23వ వార్డు కౌన్సిలర్ ప్రదీప్ తన తండ్రి ఏలియా పుట్టినరోజు సందర్భంగా తండ్రి, జిల్లా పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.కుమార్ చేతుల మీదుగా గురువారం వీల్‌చైర్, చీరలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

12 చీపిలో 'మీకోసం'

మందస : మండలంలోని ఈ నెల 12న చీపిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రఘుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలాస డివిజన్‌లోని అన్ని శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవుతాయని తెలిపారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్వాడీలో ఉచిత వైద్య శిబిరం

ఇచ్ఛాపురం: మండలంలోని మండపల్లి పంచాయతీ భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి బరువు, ఎత్తును కొలిశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త బి.నరసమ్మ పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



శస్త్రచికిత్సలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రోగులు

ప్రజాశక్తి- రణస్థలం

నేత్రాల ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రంలో కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 124 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 18 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైందన్నారు. కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, అలాగే కంటి రెప్పలను ఆడిస్తుండాలని, దీని వలన కళ్ళు పొడిబారకుండా ఉంటాయన్నారు. క్యారెట్, తాజా పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్డులోని పచ్చసొనల్లో విటమిన్ ఎ ఉంటుందని ఇది కంటి ఆరోగ్యానికి మంచిదన్నారు. కంటిచూపు మసకబారటం, కంటి నొప్పి, కళ్లముందు మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రతినిధి సోమేష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి చర్యలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలు పూర్తి చేసేందుకు లబ్ధిదారులు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. 112 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే మరో 228 గృహాలు శ్లాబ్‌లెవిల్ వరకు వచ్చి ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను పెట్టడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాల్లో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సచివాలయ సిబ్బంది,



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ ఎఇ పి.లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ.రాంప్రసాద్, ఎస్.మదన్‌మోహన్, డిఇఒ పురుషోత్తంరావు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం



పొందూరు : పుస్తకాలు అందజేస్తున్న రవికుమార్

పొందూరు: రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం ఇస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. గతంలో సిఎం చంద్రబాబు విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఉమ్మడి రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్, ఐటీ రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. అమ్మకు వందనం పథకం రాష్ట్రంలో కచ్చితంగా అమలవుతుందని, దీనిపై వైసిపి తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికప్పల హనుమంతురావు, నాయకులు రామారావు, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని, ప్రతి విద్యార్థి చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కళింగపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చెప్పినట్టు కలలు కని వాటినినిజం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎల్లప్పుడూ దృఢసంకల్పాన్ని కలిగి ఉండాలన్నారు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని వాటిని విజయ సోపానాలుగా మలచుకోవాలని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తుందని అన్నారు. ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలన్నారు. సంపద హోదా ఇవ్వలేని గౌరవం, విలువ చదువు ద్వారా మాత్రమే లభిస్తాయన్నారు. అందుకు విద్యార్థులు అందరూ చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చిన్నయ్య ఆచారి మాస్టారు మృతి

ప్రజాశక్తి- పొందూరు



చిన్నయ్య ఆచారి మాస్టర్

ప్రముఖ రంగస్థల కళాకారుడు సింహాద్రి చిన్నయ్య ఆచారి మాస్టారు గురువారం మృతి చెందారు. పట్టణానికి చెందిన చిన్నయ్య ఆచారి మాస్టర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తూనే కళారంగానికి సేవలను అందించారు. హార్మోనియం, వాయిద్యకారుడుగా, మేకప్ ఆర్టిస్టుగా పేరు సంపాదించారు. ఉపాధ్యాయుడుగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా నాటకరంగంలో ఎంతోమందిని తన వారసులుగా తయారుచేసి గుర్తింపు పొందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం కన్నుమూశారు. ఈయన మృతికి పొందూరు రంగస్థల కళాకారుల సంఘం ప్రతినిధులు వి.మురళీమోహన్, బి.శ్రీనివాసం, కె.శాంతారాం, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు తమ సంతాపం తెలిపారు.

ఎన్‌టిఆర్ గృహాలపై సర్వే



అల్లెనలో ఎన్‌టిఆర్ గృహాలపై సర్వే చేస్తున్న ఎఇ తదితరులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని వివిధ గ్రామాల్లో గతంలో నిర్మించిన ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ శాఖ ఎఇ పి.లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని అల్లెనలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19లో గత టిడిపి ప్రభుత్వ హయాంలో గృహాలు నిర్మించుకొని బిల్లులు అందని లబ్ధిదారుల వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. తద్వారా లబ్ధిదారులకు ఎంతవరకు బిల్లులు అందాయి, ఎంతవరకు గృహాలు నిర్మించుకున్నారు వంటి విషయాలను నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 800 గృహాలు ఉన్నట్లు తెలిపారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి- పలాస

ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కొటారింగి, గట్టూరు గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవ వారోత్సవాల్లో సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కొటారింగి నుంచి గొప్పిలి, పలాస మెయిన్ రోడ్డు వరకు ఉన్న రహదారిని తక్షణమే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం వర్తించనందున ఆదివాసీల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సవర తేజ, గోపాల్, సాంబ, నీలమ్మ, సుశీల, జయ పాల్గొన్నారు.